## క్లుప్తంగా

### మేరిగను పరామర్శించిన వెంకటగిరి రాజా



మేరిగను పరామర్శించి మాట్లాడుతున్న వెంకటగిరి రాజా వారసులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర

**చిల్లకూరు:** వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను ఆయన నివాసంలో గురువారం వెంకటగిరి రాజా వారసులు, ఆంధ్రా క్రికెట్ బోర్డు మాజీ కార్యదర్శి వెలుగోటి సర్వజ్ఞ కుమార యాచేంద్ర పరామర్శించారు. మేరిగ మురళీధర్ తండ్రి ఆనందరావు ఇటీవల మృతి చెందడం విదితమే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీని పరామర్శించారు. అనంతరం గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల రాజకీయ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బొమ్మిడి శ్రీనివాసులు, మేధావుల ఫోరం కన్వీనర్ నందవరం సుబ్బారావు, నాయకులు రాఘవరెడ్డి, సుబాన్, జిలానీ బాషా, ఇస్మాయిల్, హర్ష, పూర్ణ, ప్రశాంత, కోదండయ్య, పలు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. అలాగే గూడూరుకు చెందిన టీడీపీ నాయకులు చాంద్‌బాషా మేరిగను పరామర్శించారు.

### హైస్కూల్‌కు క్రీడాసామగ్రి వితరణ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

**చిల్లకూరు:** మండలంలోని నెలబల్లిరెట్టపల్లె జెడ్పీ హైస్కూల్‌కు గూడూరుకు చెందిన ప్రగతి సేవా సంస్థ క్రీడా సామగ్రిని వితరణ చేసింది. గురువారం ఆ స్కూల్లో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ క్రీడాసామగ్రితోపాటు పది కుర్చీలు, కొంత నగదును హెచ్‌ఎం విజయలక్ష్మి, టీచర్లకు అందజేశారు. క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఈ వితరణ చేయడం అభినందనీయమని హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు అన్నింటా రాణించాలని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళీ నాయుడు, రామోహన్‌రావు, రవి, వెంకటేశ్వరరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాలపై దాడులు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ కన్నయ్య

**సైదాపురం:** మండలంలోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయాధికారులు గురువారం ఆకస్మిక దాడులు చేశారు. మర్లపూడి, సైదాపురంలోని ఎరువుల దుకాణాలను నెల్లూరు ఏడీఏ కన్నయ్య, ఏఓ నాగమోహన్ నేతృత్వంలో తనిఖీలు చేశారు. రికార్డులు, స్టాకు వివరాలను పరిశీలించారు. కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్‌ఆదేశాల మేరకు తనిఖీలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఓ హైమావతి పాల్గొన్నారు.

### స్వశక్తితో యువత అభివృద్ధి చెందాలి:ఎమ్మెల్యే



కేఫ్ అండ్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థు దంపతులు

**నాయుడుపేటటౌన్:** యువత స్వశక్తితో అభివృద్ధి చెందాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. స్థానిక గోమతి సర్కిల్ సమీపంలో బైపాస్ రోడ్డు వద్ద నూతన సిండికేట్ కేఫ్ అండ్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అధునాతన హంగులతో చిగురువాడ అశోక్, జె.శ్రీనాథ్, యుగేష్ బాబు, సంజీవ్ ఈ కేఫ్‌ను ఏర్పాటు చేశారు. వారిని ఎమ్మెల్యే పైవిధంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు నెలవల రాజేష్, రంజిత్, ఉయ్యాల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కుక్క దాడి : ఒకరికి గాయాలు

**సూళ్లూరుపేట రూరల్:** సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు నివాసముటున్న దినేష్ ఠాకూర్ అనే వ్యక్తిపై గురువారం వీధి కుక్క దాడి చేసి కరిచింది. నాలుగు చోట్ల అతనికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### చికెన్ ధరలు 29-8-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | | |
|---|---|---|
| బ్రాయిలర్ లైవ్ | : | 114 |
| లేయర్ లైవ్ | : | 118 |
| బ్రాయిలర్ చికెన్ | : | 210 |
| బ్రాయిలర్ స్కిన్ లెస్ | : | 230 |
| లేయర్ చికెన్ | : | 200 |

# గణనాథా నమోస్తుతే..!

**సూళ్లూరుపేట రూరల్:** సూళ్లూరుపేట మండల వ్యాప్తంగా వినాయక చవితి పండుగ సంబరాలు అంబరాన్ని తాకాయి. పట్టణంలోని కచేరి వీధి, షార్ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసి వినాయకుని విగ్రహాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలు చోట్ల అన్నదానం చేశారు.

**నాయుడుపేటలో..**

**నాయుడుపేటటౌన్:** పట్టణంలోని దర్గా వీధిలో సుమారు రూ.10 లక్షలతో సెట్టింగ్ తరహాలోనే ఆలయం ఏర్పాటు చేసి 22 అడుగుల భారీ వినాయకుని విగ్రహాన్ని కొలువుదీర్చి పూజలు చేశారు. వాడవాడలా మండపాల్లో గణేషుడు పూజలు అందుకున్నారు. ముస్లిం వీధి, అగ్రహారపేటలో హిందువులు, ముస్లింలు, యువత కలిసి వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి, పూజలు చేసి, మత సామరస్యతను చాటారు. పలుచోట్ల ఉట్లోత్సవం నిర్వహించారు. అన్నదానాలు చేశారు. గురువారం రాత్రి ఘనంగా నగరోత్సవం నిర్వహించారు. గడియారం సెంటర్ వద్ద ఆర్యవైశ్య నాయకులు మట్టి వినాయకుని విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. బ్రాహ్మణవీధిలోని ఉన్న షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

**ఓజిలి:** మండలంలోని ఆర్మేనిపాడు, ఓజిలి, కురుగొండ, మానమాల, రాచపాళెం, రాజుపాళెం తదితర గ్రామాల్లో వివిధ రూపాల్లోని విఘ్ననాధులు ఆలయాల్లో కొలువుదీరి పూజలు అందుకున్నారు. యువకులు ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. అనంతరం సముద్రంలో నిమజ్జనానికి గణనాధులు తరలివెళ్లారు.



చిల్లకూరు: పుల్లూరులో ఉట్టి కొడుతున్న యువత

**దొరవారిసత్రంలో..**

**దొరవారిసత్రం:** మండల వ్యాప్తంగా వినాయక చవితి ఘనంగా నిర్వహించారు. గురువారం ఏకొల్లు, తల్లంపాడు, టపాయిండ్లు, శ్రీధనమల్లి, మావిళ్లపాడు తదితర గ్రామాల్లో వినాయుకుడి విగ్రహాల వద్ద అన్నదానం చేశారు. కొన్నిచోట్ల విగ్రహాలు ఏర్పాటు చేసి మూడవ రోజు కావడంతో వాకాడు మండలం తూపులపాళెం వద్ద సముద్రంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

**పెళ్లకూరు మండలంలో..**

**పెళ్లకూరు:** చిల్లకూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నెలబల్లిలో ఎంపీపీ శేఖర్‌రెడ్డి, పాలచ్చూరులో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డి, అక్కగారిపేటలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, చెంబేడులో పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం ఆధ్వర్యంలో గణనాధునికి ప్రత్యేక పూజలు చేశారు. పుల్లూరు, శిరసనంబేడు, చిల్లకూరు, పునబాక తదితర గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా ఉట్లోత్సవం నిర్వహించారు.



దొరవారిసత్రం: ఏకొల్లులో..



సూళ్లూరుపేటలో..



నాయుడుపేటలో విజయగణపతి స్వామి వార్ల నగరోత్సవం



నాయుడుపేటటౌన్: అగ్రహారపేటలో ..



ఓజిలిలో..



నాయుడుపేట టౌన్: పెద్ద దర్గా వద్ద భారీ వినాయకుని విగ్రహం వద్ద పూజలను నిర్వహించిన నాయకులు

## వెంకటగిరి నియోజకవర్గంలో..



సైదాపురం: వినాయకుని ఊరేగింపు

**వెంకటగిరి రూరల్:** మండల వ్యాప్తంగా వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. వెంకటగిరిలో వివిధ చోట్ల వినాయకస్వాముల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బూందితో ఏర్పాటు చేసిన వినాయస్వామి, ఇండియన్ ఆర్మీ సెటప్, శక్తి, అఖండ భారత్ సెట్టింగ్‌లో వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలు విశేషంగా భక్తులను ఆకట్టుకున్నాయి. గురువారం తెలుగుగంగ కాలువలో పలు విగ్రహాలను నిమజ్జనం చేశారు. పలు చోట్ల ఉట్టి కొట్టారు. అన్నదానం చేశారు.

**సైదాపురం, కలువాయి మండలంలో..**

**సైదాపురం/కలువాయి(సైదాపురం):** సైదాపురం, కలువాయి మండలాల్లో చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రెండో రోజు గురువారం ఆయా ప్రాంతాల్లో వినాయకుని విగ్రహాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు పోటీ పడ్డారు. పలు చోట్ల అన్నదానం చేశారు. సైదాపురం మండల వ్యాప్తంగా సుమారు 200 విగ్రహాలను ఏర్పాటు చేశారు. కలువాయి మండలం చినగోపవరంలో వినాయకుని విగ్రహాన్ని చిన్నారులే మట్టితో తయారు చేసి పూజలు చేశారు.





వెంకటగిరి రూరల్: ఉట్లోత్సవంలో ఉట్టికొడుతున్న చిన్నారి , వెంకటగిరి రూరల్: పెద్దశివాలయం ఆలయ ప్రాంగణం వద్ద భారత సైనికుల రూపంలో వినాయస్వాములు

## గూడూరు నియోజకవర్గంలో..



చిల్లకూరు: బల్లవోలులో భక్తులకు చేస్తున్న అన్నదానం

**గూడూరు పట్టణం, రూరల్‌లో..**

**గూడూరురూరల్:** గూడూరు పట్టణ, రూరల్ ప్రాంతాల్లో వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. చెన్నూరు గ్రామ సినిమా హాలు వీధిలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**చిట్టమూరులో..**

**చిట్టమూరు:** వినాయక చవితి పర్వ దినాన్ని మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చలువ పందిళ్లలో వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. రాత్రి వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో రెండవ రోజు నిమజ్జనం చేశారు. యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. ఆరూరులో స్వామి వారి లడ్డు వేలం వేశారు.



చిట్టమూరు: గ్రామోత్సవంలో వినాయకస్వామి

**చిల్లకూరులో..**

**చిల్లకూరు:** మండలంలో చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం పలు విగ్రహాల వద్ద దాతలు, భక్తులు, కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. తీర ప్రాంతంలోని బల్లవోలులో వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు చెంచు కిరణ్‌రెడ్డి ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పూజల అనంతరం అన్నదానం చేశారు.

# పాలక మండళ్ల ప్రమాణ స్వీకారం

**చిల్లకూరు:** మండలంలోని కలవకొండ, ఏరూరు గ్రామాలలోని రెండు ఆలయాలకు నియమించిన పాలక మండళ్లు గురువారం అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశాయి. కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలక మండలికి గ్రామానికి చెందిన కందల అర్చన చైర్‌పర్సన్‌గా, వాసవి, ముత్యాలమ్మ, వెంకటసుబ్బయ్య, రాజమ్మ, చెంగల్‌రాయుడు, వెంకటేశ్వర్లు, శేషమ్మ, చలపతి సభ్యులుగా, అలాగే ఏరూరులోని చెన్నకేశవస్వామి ఆలయ పాలక మండలికి చైర్మన్‌గా గ్రామానికి చెందిన ఉడతా శ్రీనివాసులు, సభ్యులుగా బాలసుబ్రహ్మణ్యం, అరుణమ్మ, దయానందరెడ్డి, అజిత, రమాదేవి, అంకయ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఈఓలు నవీన్‌కుమార్, రవికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారులు

# విద్యుత్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**గూడూరు రూరల్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ వద్ద 25 ఏళ్ల క్రితం విద్యుత్ ఉద్యమంలో పోలీసుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల త్యాగాలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అన్నారు. గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం వామపక్షాల నాయకుడు బషీర్‌బాగ్ అమరుల 25వ వర్ధంతి నిర్వహించారు. వారు మాట్లాడుతూ, అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో టీడీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా చేసిన ఆందోళనపై ప్రభుత్వం నిరంకుశంగా కాల్పులు జరిపించిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ, చిల్లకూరు మండల కార్యదర్శులు శశికుమార్, రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సీపీఎల్, సునీల్, మీరాభాయ్, గోపాల్, యాకోబు, రసూల్, జిలాని, ఫరూక్, సీపీఎం నాయకులు పామంజి మణి, బీవీ.రమణయ్య, ఎంబేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్షాల నాయకులు

## ఉద్యోగోన్నతి సన్మానం

**నాయుడుపేటటౌన్:** మండలంలోని విన్నమాలకు చెందిన ఏ.శశికుమార్ నరసరావుపేట స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐగా పనిచేస్తు సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన స్వగ్రామానికి రావడంతో స్థానిక బామ్ సేఫ్ నాయకులు, పలు ఉద్యోగ సంఘాల నేతలు గురువారం ఆయన్ను సన్మానించి అభినందించారు. ఇప్పటికే శశికుమార్ సోదరుడొకరు సీఐగా, మరో సోదరుడు టీచర్‌గా పనిచేస్తూ స్వగ్రామానికి తమవంతు సేవలు అందిస్తున్నారని కొనియాడారు.

# నిమజ్జనాలతో కిక్కిరిసిన తూపిలిపాళెం బీచ్



సముద్రంలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



సముద్ర తీరంలో ఏర్పాట్లపై భక్తులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనన్

**వాకాడు:** వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని పలు జిల్లాల నుంచి భక్తులు వివిధ వాహనాలపై వినాయకుని విగ్రహాలను గురువారం మండలంలోని తూపిలిపాళెం బీచ్‌కు చేరుకుని సముద్రంలో నిమజ్జనం చేశారు. ఈ పర్యాయం తిరుపతి, నెల్లూరు జిల్లాలతోపాటు తమిళనాడు సరిహద్దు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఇక్కడికి రావడం విశేషం! నిమజ్జనానికి తరలుతున్న గణనాధులతో రహదారులు సందడిగా కనిపించాయి. తొలి రోజు 75 విగ్రహాలతోపాటు, 6 వేలకు పైగా భక్తులు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. వాకాడు ఎస్‌ఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు భక్తులకు భద్రత కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సముద్ర తీరం కిటకిటలాడింది. వయోభేదం లేకుండా రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. సముద్ర స్నానాలు ఆదరించి పూజలు చేశారు.

**నిమజ్జనాలను పరిశీలించిన గూడూరు సబ్ కలెక్టర్**

తూపిలిపాళెం సముద్ర తీరంలో ప్రారంభమైన గణేష్ నిమజ్జనాలను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌తోపాటు డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. సముద్రతీరంలో ఏర్పాట్లు ఎలా ఉన్నాయో సబ్ కలెక్టర్ భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ సేవలందిస్తున్న వలంటీర్లకు సబ్‌కలెక్టర్ యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీ సయ్యద్ రఫీ, ఆర్‌ఐ అఖిల్, గ్రామ ఉప సర్పంచ్ కిరణ్‌కుమార్ రెడ్డి, మత్స్యశాఖ అధికారి రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**గూడూరురూరల్:** గూడూరులోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో గురువారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి శిబిరానికి వచ్చిన రోగులను నేత్ర వైద్యులు పరీక్షించారు. సంస్థ ఏఓ కృష్ణ మాట్లాడారు. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో నిర్వహించే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

**చిల్లకూరు:** మండలంలోని జాతీయ రహదారిపై కోట క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం.. పెళ్లకూరు మండలం చెంబడిపాళెంకు చెందిన ఆటోడ్రైవర్ సునీల్ తన ఆటోలో నెల్లూరు నుంచి ట్రాక్టర్ సామగ్రిని తీసుకుని నాయుడుపేటకు వస్తూ కోట క్రాస్ రోడ్డు వద్ద మోటార్ సైకిల్‌ను తప్పించబోయే యత్నంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆటో బోల్తా పడి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మరో ఘటనలో– కోటకు చెందిన భార్యాభర్తలు శ్రీనివాసులు, సునంద మోటారు సైకిల్‌పై గూడూరుకు వస్తుండగా, జాతీయ రహదారిపై కోట క్రాస్ రోడ్డు వద్ద మలుపు వద్ద ప్రమాదానికి గురయ్యారు. నాయుడుపేట నుంచి గూడూరు వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో వారిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఈ రెండు ప్రమాదాల్లో గాయపడిన ముగ్గురినీ గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే ఎదుటే భూవివాదంపై రచ్చ



వివాదం సర్దుబాటు చేస్తున్న ఎస్‌ఐ

**సైదాపురం :** సైదాపురం సొసైటీ కార్యాలయం వద్ద గురువారం సైదాపురం ప్రాథమిక సహకార సమితి అధ్యక్షుడు, సభ్యులు ప్రమాణ స్వీకారం స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షులుగా రామసాగరంకు చెందిన అమ్మినేని సుబ్రమణ్యం నాముడు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మొలకలపూండ్ల గ్రామానికి చెందిన వారు ఓ భూవివాదం విషయంపై ఎమ్మెల్యేకు వివరించేందుకు రావడంతో అక్కడ వివాదం చోటు చేసుకుని ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సమావేశం నుంచి బయటకు పంపేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోడు నాగేశ్వరరావు యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు రమణయ్య, రాపూరు ఏఎంసీ చైర్‌పర్సన్ ఆవుల వాణి పాల్గొన్నారు.

## బైక్‌లు ఢీ

**–ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు**

**నాయుడుపేటటౌన్:** స్థానిక డీఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలో రహదారిపై గురువారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. పట్టణానికి చెందిన పుష్పక్ సాయి తేజ్ బైక్‌పై వస్తుండగా ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొనడంతో సాయితేజ్‌తో పాటు మరో బైక్‌లో ఉన్న గణేష్ గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రారంభమైన పోలేరమ్మ జాతర

**రాజా ప్యాలెస్‌లో బహిర్గతమైన విభేదాలు**



రాజా కుటుంబీకుల అనుచరులు మల్లికార్జున్ వద్ద నుంచి తాంబులం స్వీకరిస్తున్న అమ్మవారి సేవకులు



ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి, మరో సామాజిక వర్గం నేతలు లేకుండా చాటింపు వేస్తున్న అమ్మవారి సేవకులు

**సైదాపురం/వెంకటగిరి రూరల్ :** పోలేరమ్మ తల్లి జాతరలో ఆదిలోని అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. రాజా ప్యాలెస్‌లోని ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్న ఓ సామాజిక వర్గం తాంబూలాలను కాంపాళెం మరో సామాజిక వర్గం (అమ్మవారి సేవకులు) తిరస్కరించారు. జాతర నిర్వహణ పెద్దిరెడ్డి దశరథరామిరెడ్డి చేతుల మీదు గా తాంబూలం స్వీకరించమని, తాము అమ్మవారి సేవకులమని... తమ సేవలకు డబ్బులతో వెలకట్టడమే కాకుండా కులం పేరుతో తక్కువ చేసి మాట్లాడుతున్నాడని కాంపాళెంలో ఓ సామాజిక వర్గం బహిష్కరణకు సిద్ధ పడింది. ఈక్రమంలో రాజాల అనుచరుడు మల్లికార్జున్ చేతుల మీదుగా తాంబూలం స్వీకరించారు. అలాగే, బుధవారం అర్ధరాత్రి జాతర చాటింపు వేయాల్సి ఉండగా కాంపాళెంలోని గ్రామ పోలేరమ్మతల్లి వద్ద ప్రత్యేక పూజల అనంతరం కామాక్షమ్మ ఆలయం వద్ద పూజలు చేసేందుకు ఈఓ, మరో సామాజిక వర్గం నేతలు, పలువురు ఆలయం వద్దకు రాగా అంతలోపే మరో సామాజిక వర్గంవారు పూజ లు చేసిఈఓ, పెద్దిరెడ్డి, గ్రామస్తుల ప్రమేయం లేకుండా కాంపాళెంలో తొలి చాటింపు వేస్తూ వెంకటగిరిలోకి వచ్చేశారు. రాష్ట్ర పండుగ హోదాలో సుమారు రూ. కోటి పైగా నిధులు వెచ్చించి వైభవంగా నిర్వహించాల్సి ఉన్న పోలేరమ్మ జాతరలో ఆదిలోనే రెండు సామాజిక వర్గాలకు విభేదాలు చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

## భూ సమస్య పరిష్కారానికి చర్యలు

**చిల్లకూరు:** తీర ప్రాంతంలోని మోమిడి రెవెన్యూ పరిధిలో నెలకొన్న భూ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని వరగలిలో రెవెన్యూ అధికారులు గ్రామ సభ ఏర్పాటు చేశారు. మోమిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 695లో సీలింగ్ కింద 13మంది వరగలి గ్రామ దళితులకు సుమారు 27 ఎకరాలకు దాదాపు 35 ఏళ్ల క్రితం పట్టాలు పంపిణీ చేయడంతో జీడిమామిడి, జామాయిల్ సాగు చేస్తున్నట్టు చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కోరడంతో కొంత మంది అవి ప్రభుత్వ భూములని అధికారులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. ఈ నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకునేందుకు గ్రామసభ ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు తమ వద్ద ఉన్న ఆధారాలు అధికారులకు చూపే ప్రయత్నం చేయగా కొందరు అడ్డుకోవడం వివాదానికి దారితీసింది. దీంతో తహసీల్దార్ పైవిధంగా స్పందించారు. ఆర్‌ఐ పూర్ణ, వీఆర్‌ఓ ఉదయ్, వరగలి ఎంపీటీసీ దారా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.